

18న ఉపాధి హామీ చట్టంపై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలని, పని దినాలు, వేతనాలు పెంచాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన ఏలూరు, ఆర్ఆర్‌పేటలోని శ్రీకాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు ఎంపీ శివదాసన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివి.శ్రీనివాసరావు, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, శివ నాగరాణి, సిపిఐ జిల్లా కార్యదర్శి మాన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలోని చేతి వృత్తిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎపి చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ ఆగోల్లు వెంకట కృష్ణారావులు పిలుపునిచ్చారు.

ఇలాగైతే పాఠాలు చెప్పేదెలా..!

తీవ్ర పని ఒత్తిడితో ఉపాధ్యాయులు సతమతం

బోధనేతర పనుల భారమే అధికం

ప్రతినెలా జీతాల కోసం ఎదురుచూపులు

తీవ్ర నిరాశ, నిస్పృహాల్లో 12 వేల మంది



ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తీవ్ర పని ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్నారు. బోధన కంటే ఇతర పనుల భారం ఎక్కువ కావడంతో మానసికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపా ధ్యాయులకు రావాల్సిన జీతాల నుంచి మిగిలిన అన్ని సౌకర్యాల్లోనూ కోతలు విధిస్తున్నారు. చివరకు ప్రతి నెలా జీతాలకు సైతం రోజులు తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరు పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో సుమారు 2500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. సుమారు 12 వేల మంది వరకూ ఉపాధ్యాయులు ఉన్నారు. బోధన కంటే ఇతర పనుల భారం వీరిపై అధికం కావడంతో గత రెండు, మూడేళ్లుగా చాలామంది ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడితో బాధపడుతున్నారు. సమయానికి కనీసం జీతాలు కూడా సర్కారు ఇవ్వకపోవడంతో ఆర్థికంగానూ అవస్థలు పడాల్సి వస్తోంది. విద్యార్థులకు బోధన విషయంలో ఎంత ఒత్తిడినైనా ఆనందంగా స్వీకరించే గురువులపై యాప్‌లు, జిఇఆర్‌లు, ముఖ గుర్తింపుతో అదనపు భారం పెంచేయడంతో కుంగిపోతున్నారు.

అన్నింటా కోతలే

ఉపాధ్యాయులకు అందించే జీతాల నుంచి అన్ని సౌకర్యాల్లోనూ ప్రభుత్వం విపరీతంగా కోతలు విధిస్తోంది. ఇంటి అద్దెలోనూ కోత వేశారు. ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఎ) కూడా 20 శాతం ఉంటే 16 శాతానికి, 15 శాతం ఉన్న వాళ్లకు 12 శాతానికి, 12 ఉన్న వాళ్లకు 10 శాతానికి తగ్గించారు. నగరాలు, మున్సిపాల్టీలు, గ్రామాల్లో పని చేసే వారందరికీ గతంలో ఉన్న హెచ్ఎస్ఎలో కోత వేశారు. ఉదాహరణకు రూ.15 వేల హెర్ఆర్ఎ ఉంటే అది రూ.12,500కు తగ్గిపోయింది.

జీతాల కోసం రోజులు తరబడి ఎదురుచూపులు

వివిధ రకాల పనులతో సతమతమవుతూ పని భారంతో నెలంతా పని చేస్తున్నా ప్రతినెలా ఇచ్చే జీతాల కోసం ఉపాధ్యాయులు రోజులు తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రతి నెలా ఉత్పన్నమవుతోంది. ఆగస్టుకు సంబంధించిన జీతాలు సెప్టెంబరు 12వ తేదీ దాటినా పూర్తిస్థాయిలో పడలేదు. జూన్ 10వ తేదీతో ఉపాధ్యాయుల బదిలీలు ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు గత మూడు, నాలుగు నెలలుగా జీతాలందలేదు.

అడుగడుగునా అవమానాలు

ఏడాదిగా ఉపాధ్యాయుల మీద ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయింది. ఉన్నతాధికారులు పాఠశాలలను సందర్శించడం. నోట్స్, పాఠ్యపుస్తకాలు చూసి విద్యార్థులను ప్రశ్నలు అడగడం, ఎవరైనా సరిగా చెప్పలేకపోతే పిల్లల ముందే ఉపాధ్యాయులను అవమానించడం, వాటిని వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని వాపోతు న్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత తమపై ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదని, దానికోసం తాము ఎంత సమయమైనా కేటాయిస్తామని, అయితే ఇలా అవమానించడమే ఎక్కువ బాధగా ఉంటోందని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు వాపోతున్నారు.

ప్రభుత్వ విధానాలతో సతమతం

జిఒ నెం.117తో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని సవరించారు. ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను దగ్గర్లో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలిపేశారు. దీంతో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోయింది. ఉన్న వారిపైనే ఒత్తిడి పెంచేసి పాఠాలు చెప్పించడం వల్ల రోజంతా ఎనిమిది పీరియడ్లు ఉంటే కనీసం ఏడు చెప్పాల్సి వస్తోంది. వారానికి గత ప్రభుత్వంలో 30 పీరియడ్ల వరకూ ఉండగా ప్రస్తుతం కనీసం 40 నుంచి 45కు పెరిగాయి. దీనివల్ల విద్యార్థుల నోట్స్ దిద్దడానికి, పాఠాలు చెప్పేందుకు సన్నద్ధమవ్వడానికి సమయం లేక అవస్థలు పడుతున్నామని గురువులు వాపోతున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్, యాజ్ ఎ ఫారెన్ లాంగ్వేజ్) పేరుతో మూడో తరగతి నుంచి తొమ్మిది వరకూ ఆంగ్ల ఉపాధ్యాయులు వారానికి మూడు పీరియడ్లను అదనంగా చెప్పాల్సిన పరిస్థితి. దీంతో వారానికి 45 పీరియడ్లపైనే బోధించాల్సి వస్తోంది. ఇంత భారమైనా అలాగే బోధిస్తున్నా ప్రభుత్వం మాత్రం కనీసం టోఫెల్‌కు సంబంధించి ప్రింటెడ్ మెటీరియల్, ఓ పుస్తకం కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. అంతా సామాజిక మాధ్యమం చూసే బోధించాలని చెబుతోందంటూ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాప్‌లతో మరింత పని ఒత్తిడి

మధ్యాహ్న భోజనం యాప్‌లో ప్రతిరోజూ వండిన ఆహార పదార్థాలను ఉపాధ్యాయుని ఫొటోతో సహా అప్‌లోడ్ చేయాలి. గురువులకు ఇప్పుడు ఇదొక భారం. ఆహారం సరిగా లేకపోతే అప్‌లోడ్ చేసిన వాళ్లే బాధ్యులు. మరుగుదొడ్ల నిర్వహణ ఫండ్ (టిఎంఎస్) యాప్‌లో ప్రతిరోజూ పాఠశాలలోని మరుగుదొడ్లు, మూత్రశాలల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని చేసే ఈ యాప్‌లో ఒక్కోసారి అంతా బాగున్నా బాగోలేదంటూ చూపిస్తోందని, షోకాజ్ నోటీసులు వస్తున్నాయని గురువులు వాపోతున్నారు.

హాజరుకు అష్టకష్టాలు

ప్రస్తుతం ఉపాధ్యాయులకు వారి మొబైల్ ఫోన్లలోనే ముఖగుర్తింపు యాప్‌ను అప్‌లోడ్ చేశారు. అయితే ఉదయం, సాయంత్రం దీనిలో హాజరు వేసుకోవడం తలకు మించిన భారంగా మారుతోంది. ఒకేసారి ఉపాధ్యాయులంతా హాజరు వేసుకునేందుకు ప్రయత్నిస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. కనీసం 20 నిమిషాలు ప్రయత్నిస్తేనే హాజరు పడుతోంది. ఏమాత్రం పడకపోయినా షోకాజ్ నోటీసులు వస్తున్నాయని గురువులు వాపోతున్నారు. పాఠశాల వదిలేసిన తర్వాత కూడా అక్కడే ఉండి హాజరు వేసుకుని వెళ్లేందుకు సెల్‌ఫోన్లతో కుస్తీలు పడుతున్నారు.

పెంచాల్సింది.. తగ్గించడంతో..!

ఐఆర్ కంటే ఫిట్‌మెంట్ తక్కువ ఇచ్చిన ప్రభుత్వం ఇదేనంటూ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. 27 శాతం, ఆపైన ఇవ్వాల్సిన ఫిట్‌మెంట్‌ను 22 శాతానికి తగ్గించారు. ఎప్పుడూ లేనివిధంగా పిఆర్‌సిలో జీతాలు పెరగకపోగా తగ్గాయి. నాలుగు శాతం వరకూ తగ్గించడంతో రెండు జిల్లాల్లోని గురువులు ఆర్థికంగా నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలోని ఓ ఉపాధ్యాయునికి రూ.97 వేల జీతం వస్తుంటే అది పిఆర్‌సి తర్వాత రూ.83 వేలకు తగ్గిపోయింది. గతంలో ఎన్నడూ ఇలా జరిగింది లేదని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెలవుల డబ్బులూ ఇవ్వట్లేదు

ఉపాధ్యాయులు ఇఎల్‌ను సరెండర్ లీవుగా చేసుకుని డబ్బుగా మార్చుకుంటారు. అయితే ఉపాధ్యాయులకు గత ఏడాదిన్నర నుంచి సరెండర్ లీవ్ క్యాష్ మంజూరైనా బ్యాంకు ఖాతాల్లో మాత్రం డబ్బులు పడలేదు. (రూ.50 వేల జీతం ఉన్న ఉపాధ్యాయులు 15 రోజులు సరెండర్ లీవులు పెడితే రూ.25 వేల వరకూ డబ్బులొస్తాయి.) ఒక ఉపాధ్యాయుడికి జీతాన్ని బట్టి ఎన్ని రోజులు సెలవులు సరెండర్ చేస్తే అంత జీతం అదనంగా ఇస్తారు. ఇవేమీ పూర్తిస్థాయిలో వస్తున్న పరిస్థితి లేదు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎ.వికె.రామభద్రం, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. పనిభారం విపరీతంగా పెరిగింది. బోధనే కాకుండా అనేక రకాల పనులను ప్రభుత్వం చేయిస్తోంది. దీంతో ఉపాధ్యాయులు మానసికంగా కుంగిపోయి అనారోగ్యం బారిన పడుతున్నారు. కనీసం సమయానికి జీతాలిచ్చే పరిస్థితి కూడా సర్కారు లేదు. రకరకాల టెక్నికల్ సమస్యలు చూపించి జీతాలను నిలుపుదల చేయడం దారుణం. ప్రతి నెల పదో తేదీ దాటిన తర్వాత జీతాలు రావడంతో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల రుణాలు, ఐఎంఐలు సమయానికి చెల్లించలేకపోవడంతో విపరీతంగా ఆర్థిక భారం పడుతోంది. ఇలా అనేక సమస్యలతో ఉపాధ్యాయులు సహనంగా చేస్తున్నారు. తక్షణం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి.

పెంచాల్సింది.. తగ్గించడంతో..!

ఐఆర్ కంటే ఫిట్‌మెంట్ తక్కువ ఇచ్చిన ప్రభుత్వం ఇదేనంటూ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. 27 శాతం, ఆపైన ఇవ్వాల్సిన ఫిట్‌మెంట్‌ను 22 శాతానికి తగ్గించారు. ఎప్పుడూ లేనివిధంగా పిఆర్‌సిలో జీతాలు పెరగకపోగా తగ్గాయి. నాలుగు శాతం వరకూ తగ్గించడంతో రెండు జిల్లాల్లోని గురువులు ఆర్థికంగా నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలోని ఓ ఉపాధ్యాయునికి రూ.97 వేల జీతం వస్తుంటే అది పిఆర్‌సి తర్వాత రూ.83 వేలకు తగ్గిపోయింది. గతంలో ఎన్నడూ ఇలా జరిగింది లేదని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

సమగ్రంగా ఇఎస్‌జెడ్ హద్దుల నిర్ధారణ

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు ప్రాంతంలో ఎకో సెన్సిటివ్ జోన్ (ఇఎస్‌జెడ్) సరిహద్దుల నిర్ధారణ కోసం సమగ్రమైన ప్రతిపాదనలు సిద్ధ చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో సోమవారం కొల్లేరు ప్రాంతంలో ఎకో సెన్సిటివ్ జోన్ (ఇఎస్‌జెడ్) సరిహద్దుల నిర్ధారణ ప్రతిపాదనలకు ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో వన్యప్రాణుల అభయారణ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం కొల్లేరు ప్లస్ కాంటూరుకు పైన పది కిలోమీటర్ల పరిధి వరకూ ఎకో సెన్సిటివ్ జోన్ (ఇఎస్ జెడ్) సరిహద్దుల నిర్ధారణకు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటుచేసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. ఇఎస్ జెడ్ సరిహద్దుల ప్రాథమిక లక్ష్యం.. కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యం చుట్టూ కొన్ని కార్యకలాపాలను నియంత్రించడం, తద్వారా రక్షిత ప్రాంతాన్ని ఆవరించిఉన్న పర్యావరణ వ్యవస్థ కార్యకలాపాలకు సంబంధించిన ప్రతికూల ప్రభావాలను తగ్గించడమేనన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్ (ఇఎస్‌జెడ్) ప్రాంత నిర్ధారణ పనులను పర్యవేక్షించేందుకు కలెక్టర్ అధ్యక్షులుగా, అటవీ, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు, ట్రాన్స్‌కో, రెవెన్యూ, పంచాయతీ, మత్స్య శాఖ, వ్యవసాయం, పశు సంవర్థక శాఖ, భూగర్భ జలాలు, మున్సిపల్, పర్యావరణ, పరిశ్రమలు, సర్వే, స్వచ్ఛంద సంస్థలు, తదితరులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీ ఎకో సెన్సిటివ్ జోన్ నిర్ధారణలో వన్యప్రాణుల అభయారణ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రతికూలతలు లేకుండా చూస్తారన్నారు. గ్రామాల్లో గ్రామసభల నిర్వహణకు సంబంధించి సవివరమైన షెడ్యూల్‌ను తయారుచేసి, సంబంధిత గ్రామాల ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామ సభల్లో వచ్చే సూచనలు, అభ్యంతరాలను తప్పనిసరిగా నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. విజయవాడలోని బుడమేరు వ్యర్థాలు కొల్లేరులో కలిసి కలుషితం చేస్తున్నాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కొల్లేరు పరిసర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసిన పారిశ్రామికవేత్తలు తమ అభిప్రాయాలను, వారి పరిశ్రమల విస్తరణకు సంబంధించి వివరాలను సమావేశంలో తెలియజేశారు.

కార్పొరేట్ సామజిక బాధ్యత నిధులు చెల్లించండి

పారిశ్రామిక వేత్తలకు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి

జిల్లాలోని అన్ని పరిశ్రమలకు సంబంధించి వారి నికర ఆదాయంలో రెండు శాతంను కార్పొరేట్ సామజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల కింద జమ చేయాల్సి ఉందని, ఈ దిశగా సంబంధిత పరిశ్రమలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ప్రతీకార్పొరేట్ సంస్థ తమ నికర లాభంలో రెండు శాతంను ఆయా జిల్లాల్లో పలు సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అందించాల్సి ఉందన్నారు. జిల్లాలో కొన్ని కార్పొరేట్ సంస్థలు సిఎస్ఆర్ కింద అందించిన నిధులతో పలు చర్యలు చేపట్టామని, సర్వారాయ కంపెనీ వారు అందించిన నిధులతో భీమడోలు నుండి ద్వారకాతిరుమల వరకు రోడ్డు సెంట్రింగ్ సుందరీకరణ పనులు చేశామని తెలిపారు. అదే విధంగా మిగిలిన కార్పొరేట్ సంస్థల వారు కూడా ప్రతిపాదనలతో రావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యావరణ శాఖ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఏసుదాసు, అటవీ శాఖాధికారి ఎస్‌వికె. కుమార్, వివిధ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

వెంకటాపురం-లంకాలపల్లి రోడ్డును అభివృద్ధి చేయాలని

సిపిఎం ఆధ్వర్యాన రిలే దీక్షలు



దీక్ష చేపట్టిన నాయకులు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆంధ్రా- తెలంగాణా సరిహద్దు ప్రాంతమైన వెంకటాపురం నుండి లంకాలపల్లి వరకూ అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని, మండలంలోని అంతర్గత రోడ్ల మరమ్మతులు చేపట్టి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సెంటర్లో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షలనుద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగిన నాటినుండి పోలవరం ప్రాజెక్టుముంపు పేరుతో మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేయకుండా, అభివృద్ధిని పూర్తిగా నిలిపి కనీసం మౌలిక వసతులు కూడా కల్పించకుండా అటు పాలకులు, ఇటు ప్రభుత్వ అధికారులు ముంపు మండలాల ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. జంగారెడ్డిగూడెం, భద్రాచలం మధ్యగల ప్రధాన రహదారిపై నిత్యం అనేక వాహనాలు తిరుగుతుంటాయని, ఆంధ్రా-తెలంగాణా సరిహద్దు ప్రాంతమైన మండలంలోని వెంకటాపురం నుండి లంకాలపల్లి వరకూ గల ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ముంపుమండలాలు కావడంతో ఏ ఒక్క అధికారీ ఇటువైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి 45 కిలో మీటర్ల మేర ఉన్న ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. ఈ దీక్షలో సిపిఎం నాయకులు పట్ల లక్ష్మయ్య, మహబూబ్ పాషా, ఎస్.లక్ష్మణరావు, ఖాసీం, చంటి, వి.రాజు, పోలయ్య, మంగయ్య పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పామాయిల్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్




మృతిచెందిన రంగారావు

విద్యుద్ఘాతంతో పామాయిల్ గెలలు నరికే కార్మికుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పల్లేర్లమూడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పల్లేర్లమూడి గ్రామానికి చెందిన జంపన రంగారావు(38) ఆయిల్‌పామ్ తోటల్లో గెలలు కోసేందుకు వెళ్తుంటాడు. ఎప్పటిలాగే గ్రామంలో ఆయిల్‌పామ్ గెలలు కోసేందుకు ఉదయం వెళ్లాడు. ఇనుప కత్తితో గెలలు కోస్తుండగా అది తోటమీదుగా వెళ్లిన విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సిపిఎం ఆందోళనతో బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు అందజేత

విద్యుత్ షాక్‌తో మరణించిన రంగారావుకు ఆయిల్‌పామ్ తోట యజమాని వద్ద నుండి బాధిత కుటుంబానికి సిపిఎం ఆధ్వర్యంలో రూ.ఐదు లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జివిఎస్.రాజు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూశారు.



మేయర్‌ను అభినందిస్తున్న నాయకులు

డ్వాక్రా మహిళలకు రూ.146 కోట్ల లబ్ధి : మేయర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆసరా, సున్నా వడ్డీ పథకం, వైఎస్ఆర్ చేయూత ద్వారా ఏలూరు నగరంలో ఉన్న 49,800 మంది డ్వాక్రా మహిళలకు రూ.146 కోట్లు చెల్లించామని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఏలూరు నియోజకవర్గంలో నెల రోజులుగా డివిజన్ల వారీగా స్వయం సహాయక సంఘాల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సోమవారం 50వ డివిజన్‌కు సంబంధించిన స్వయం సహాయక సంఘాల సమావేశం స్థానిక ఎంఆర్‌సి కాలనీ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ నూర్జహాన్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు మాట్లాడారు. సిఎం జగన్ ప్రవేశపెట్టిన ప్రతి పథకం మహిళలకు అందేలా చర్యలు చేపట్టారన్నారు. ఏలూరులో 4943 స్వయం సహాయక సంఘాలున్నాయని, వీటిలో 49,800 మంది సభ్యులున్నారన్నారు. వీరికి బ్యాంకుల ద్వారా సుమారు రూ.50 కోట్ల రుణాలు చెల్లించారన్నారు. 50వ డివిజన్‌లో 55 స్వయం సహాయక సంఘాలున్నాయని సున్నా వడ్డీ, ఆసరా, చేయూత పథకాలు ద్వారా రూ.70 లక్షల వరకూ లబ్ధి పొందారన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ భాస్కర్, 55 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి 500 మంది మహిళలు, సిఒ అర్చన, ఆర్‌పిలు కుమారి, మమత స్థానిక వైసిపి నాయకులు గవరపేట నాయుడు, మానుకొండ శ్రీను, బంగారమ్మ, పెదపూడి రాజు, లారీల శ్రీను పాల్గొన్నారు.



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

బాల్య వివాహరహిత జిల్లాగా నిలపాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

బాల్య వివాహాల నిర్మూలనను సమాజంలోని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో 'బాల్యవివాహ రహిత భారతదేశం, బాలల భద్రతే భారత్ భద్రత' నినాదంతో జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఏలూరు జిల్లావాసిగా భారతదేశాన్ని బాల్యవివాహ రహితంగా తయారుచేయడానికి, బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కలిగించే ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను నిరోధించడానికి మనమంతా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు బాలిక, ఆమె పిల్లల జీవితం, భవిష్యత్తుపై తీవ్రమైన పరిమాణాలు చూపుతాయన్నారు. వీటిని నివారించేందుకు గ్రామస్థాయి నుండి కలిసికట్టుగా పని చేయాలన్నారు. బాల్య వివాహం చేయడానికి సన్నద్ధం అవుతున్నారని తెలిస్తే ముందుగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహం వల్ల పిల్లలపై ఎలాంటి దుష్పరిణామాలు పడతాయో వివరించాలన్నారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, ఇందుకు రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించబడుతుందని తెలిపారు. బాల్య వివాహాల సమాచారాన్ని 112 లేదా చైల్డ్ లైన్ 1098 నెంబరుకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ పద్మావతి, డిసిపిఒ సూర్యచక్రవేణి, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జివివి.సత్యనారాయణ, సూర్యనారాయణరెడ్డి, జిఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసరు రమణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్ రాజు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాసిడ్ దాడి కేసు ఛేదన భేష్ : డిఐజి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



బహుమతిని అందిస్తున్న డిఐజి

మహిళపై యాసిడ్ దాడి ఘటనలో అత్యంత ప్రతిభ కనబరిచి నిందితులకు శిక్ష పడేలా విచారణలో కృషి చేసిన దిశా సిఐ ఇంద్ర శ్రీనివాసులును ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్ అభినందించారు. ఏలూరు నగరంలో ఈ ఏడాది జూన్‌లో ఫ్రాన్సినా అనే మహిళపై జరిగిన యాసిడ్ దాడి కేసులో కేవలం 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేయటంతోపాటు 21 రోజుల్లోనే పూర్తి ఆధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారని అశోక్ కుమార్ తెలిపారు. న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేసిన 117 రోజుల్లో విచారణ పూర్తిచేసి నిందితుల్లో ముగ్గిరికి యావజ్జీవ శిక్ష విధించేలా పోలీస్ అధికారులు చూపిన ప్రతిభ అభినందనీయమన్నారు. ఏలూరు దిశ సిఐ ఇంద్ర శ్రీనివాస్, పోలీస్ సిబ్బందితోపాటు, ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు ప్రత్యేక శ్రద్ధతో బాధితులకు న్యాయం, నిందితులకు శిక్ష పడేలా చేయడంలో విజయంసాధించారని తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్‌సి,ఎస్‌టి స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ కేసును త్వరితగతిన విచారణ చేపట్టి నిందితులకు శిక్షలు విధించడం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం, గౌరవం పెరిగేలా చేశారని తెలిపారు. అశోక్ కుమార్ ద్వారా వారు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందుకున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని ధర్నా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



అధికారికి వినతిని అందిస్తున్న నాయకులు

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చాకిరి శివనాగరాజు అగ్రహం వ్యక్తం చేశారు. చట్టాన్ని కాపాడుకొందాం అనే నినాదంతో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్, ఏపూరి రవీంద్ర, పోలుకొండ తాతారావు, షేక్ సుభానీ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో మరో మహిళ

ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్‌లు, ఆన్‌లైన్ లింకులు పంపి రూ.34లక్షలు స్వాహా

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సైబర్ నేరాలు ఇటీవల కాలంలో అధికమయ్యాయి. చాలా సులువుగా నేరగాళ్లు ప్రజలను మోసగిస్తున్నారు. కేవలం ఒక లింకు పంపి ఆపై అనేక మాయమాటలు చెప్పి అకౌంట్లో ఉన్న డబ్బులను స్వాహా చేస్తున్నారు. ఇదే తరహా ఘటన ఏలూరు నగరంలో చేసుకుంది. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని ఓ మహిళ రూ.34 లక్షలు పోగొట్టుకుంది. దీనిపై సోమవారం రాత్రి మూడో పట్టణ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరులోని ఇంద్రప్రస్థ ప్రాంతానికి చెందిన కొత్తకోట అన్నపూర్ణ ఉన్నతవిద్యను అభ్యసించి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నారు. ఆమె మొబైల్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో శైలజ అనే పేరుతో ఓ మెసేజ్ వచ్చింది. దానితోపాటు మరో రెండు మెసేజ్‌లు వెంటవెంటనే వచ్చాయి. తొలుత రూ.1500 కట్టి దఫదఫాలుగా రూ.ఐదు లక్షలు, రూ.ఆరు లక్షలు కట్టారు. వాటికి కూడా సొమ్ములు వస్తున్నట్లుగా ఆ యాప్‌లో లాభాలు చూపించడంతో ఆమె నమ్మి మొత్తం 34 లక్షల 11 వేల 782 రూపాయలు చెల్లించారు. ఆ సొమ్ములు రావాలంటే మరో రూ.15 లక్షలు కట్టాలని చెప్పడంతో బాధితురాలు మోసపోయానని గ్రహించి సోమవారం రాత్రి ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ

ఏలూరు స్పోర్ట్స్:కలెక్టరేట్ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ ఇంటిలో భారీ చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలో నివాసం ఉంటున్న మోటేపల్లి వెంకట సీతారామాంజనేయులు(72) ఏలూరు కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఈనెల 11వ తేదీన ఆయన సత్రంపాడులో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లారు. 12వ తేదీ సాయంత్రం తిరిగి వచ్చారు. ఈ తరుణంలో దొంగలు ఆ ఇంటిలోకి చొరబడి తాళాలు పగులగొట్టి 15 కాసుల బంగారు ఆభరణాలు, రెండున్నర కేజీల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఇంటికి వచ్చి గమనించిన సీతారామాంజనేయులు చోరీ జరిగిందని గుర్తించి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేట్ల లబ్ధి కోసమే ఉపాధి చట్టానికి తూట్లు : సిపిఎం

ప్రజాశక్తి - పోలవరం

బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీని కొల్లగొట్టి, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చూస్తుందని సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ తెలిపారు. ఉపాధి హామీ పని చట్టాన్ని కాపాడుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన ఏలూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సోమవారం చేగొండపల్లి గ్రామంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కోత కోసి నిధులు ఇస్తున్నారని, కుటుంబానికి రెండు వందల రోజులు పని, 600 రూపాయలు వేతనం ఇవ్వాలని తెలిపారు. పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరింపచేసి, రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి పని ప్రదేశాల్లో మెడికల్, టెంట్లు, కనీస సౌకర్యాలు కల్పించకుండా ఎండలోనే పనులు చేపిస్తున్నారన్నారు. ఆన్‌లైన్ మస్తర్‌ను రద్దుచేసి, పాత పనిని అమలు చేయాలని, పే స్లిప్పులు ఇవ్వాలని క్షేత్రస్థాయిలో మెట్లకు స్మార్ట్ ఫోన్లు, ఐదు రూపాయలు ఇవ్వాలని కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం పోలవరం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు.

ఫెన్సింగ్ పోటీలో రాహుల్‌కు సిల్వర్ మెడల్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్



మెడల్‌తో విజేత రాహుల్

పట్టణానికి చెందిన ఎస్ఆర్ఆర్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థి వాకా రాహుల్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ అండర్-23 పోటీలలో సిల్వర్ మెడల్ గెలుచుకోవటం పట్ల పలు విద్యాసంస్థలకు చెందిన అధినేతలు, పలువురు ప్రముఖులు సోమవారం విద్యార్థిని అభినందించారు. కాకినాడలో ఈనెల 14, 15వ తేదీలలో నిర్వహించిన ఫెన్సింగ్ మెన్ అండ్ ఉమెన్ అండర్-23 పోటీలలో రాహుల్ ఈ మెడల్ గెలుపొందారు. రాహుల్ జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించాలని ప్రముఖులు అభినందించారు.

ప్రబలుతున్న విష జ్వరాలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని రామన్నగూడెం గ్రామంలో విష జ్వరాలు ప్రబలి పలువురు ఆసుపత్రి పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత 15 రోజులలో గ్రామస్తులు పదుల సంఖ్యలో విషజ్వరాలు సోకి ఆసుపత్రిలో చేరారని తెలిపారు. ప్లేట్‌లెట్స్ పడిపోవటంతో కొందరు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉండటం, పిచ్చి మొక్కలు, చెత్త విపరీతంగా పెరిగి పోవడంతో దోమలు పెరిగి విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. మలేరియా, పారిశుధ్య అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

నేడు కొమ్మినేని ద్వారకాతిరుమల రాక

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఈనెల 17వ తేదీన ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ద్వారకాతిరుమల రానున్నారు. 17న ఉదయం 8 గంటలకు విజయవాడలో బయలుదేరి, ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమల చేరుకుంటారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనం చేసుకుంటారు. అనంతరం 11 గంటలకు మీడియా ప్రతినిధులతో సమావేశం అవుతారు. తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు ద్వారకాతిరుమల నుంచి బయలుదేరి సింహాచలం వెళతారు.

ప్రతిపక్షాల అణచివేతకే గృహనిర్బంధాలు

ప్రజాశక్తి - కలిదిండి

ప్రతిపక్షాల అణచివేతకే గృహనిర్బంధాలని రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర పిలుపు మేరకు ఏలూరులో జరిగే సైకిల్ యాత్రకు బయలుదేరిన ఆయనను మట్టగుంటలో గృహనిర్బంధం చేశారన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజలను, ప్రతిపక్షాలను జగన్‌మోహన్‌రెడ్డి అణచివేస్తున్నారన్నారు. రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ ఎదుర్కోనటువంటి దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.


స్థలాలకి మార్కింగ్ వేస్తున్న ఆర్ఐ

నేడు ఇళ్ల స్థలాల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో 109 మంది లబ్ధిదారులకు ఈనెల 17వ తేదీన ఇళ్ల స్థలాల పొజిషన్ చూపిస్తామని తహశీల్దార్ ఎవి.రమణారావు తెలిపారు. ఉంగుటూరులో 2.98 ఎకరాల్లో మెరక చేసిన లే అవుట్‌లో ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు సమక్షంలో లబ్ధిదారులకు స్థలాలను చూపిస్తామని తెలిపారు. వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేసుకునేలా చైతన్యం చేస్తున్నామని తహశీల్దార్ పేర్కొన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, విఆర్ఒ రమేష్‌లు సోమవారం స్థలాలకు మార్కింగు వేశారు.

నేరాలు - ఘోరాలు

తల్లి, చెల్లిపై దాడి చేసిన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున కన్న తల్లి, చెల్లిపై కత్తిపీటతో కిరాతకంగా దాడి చేసిన కవులూరి వంశీకృష్ణ(24)ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ముద్దాయిపై ఐపిసి సెక్షన్ 219, 307, 34 పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసులకు సంబంధించి ముద్దాయిని త్వరలోనే కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'బాల్య వివాహాలను అరికడదాం'

కిషోర బాలికల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు


ఏలూరులోని పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ మంగ


ముదినేపల్లిలోని గురజ రోడ్డులో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఏలూరు-1 సెక్టార్ తంగెళ్లమూడి యుపి స్కూల్‌లో సిడిపిఒ బి.మంగ ఆధ్వర్యంలో బాల్య వివాహాల రహిత భారతదేశంగా రూపుదిద్దాలని కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు కలన కలిగే అనర్థాలు, దిశ యాప్ గురించి కిశోరబాలికలకు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

చాట్రాయి : బాల్య వివాహాలరహిత ఆంధ్రప్రదేశ్, బాల్యవివాహాల రహిత భారత్ ఉండాలని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయము నందు సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. మండల వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయం నుంచి చాట్రాయి సెంటర్ వరకు 'బాల్యవివాహాలను అరికడదాం - బంగారు భవిష్యత్తును ఇద్దాం' అంటూ నినాదాలు చేస్తూ, సెంటర్‌లో మానవహారంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శేఖర్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ గాయత్రిదేవి, సిసిలు, మండలంలో ఉన్న 38 మంది విఒఎలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : బాల్యవివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, అందుకు కారకులైన వారు శిక్షార్హులని నూజివీడు సిడిపిఒ ఎస్‌కె.నూరాణి తెలిపారు. సోమవారం పట్టణంలోని కోనేరు పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల పట్ల కలిగే అనర్థాలను ఆమె వివరించారు. కిషోర బాలికల దినోత్సవంలో భాగంగా నూజివీడు ప్రాజెక్టు పరిధిలోని అనేక గ్రామాలలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ముదినేపల్లి : కైకలూరు సిడిపిఒ ఆనంద్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ముదినేపల్లిలో సోమవారం బాల్య వివాహాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద నుంచి బయలుదేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీగా గురజ రోడ్డు సెంటర్ చేరుకున్నారు. గురజ రోడ్డులో మానవహారం నిర్వహించి, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు జాన్సీ, మల్లేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం మెయిన్ సెంటర్‌లో డ్వాక్రా మహిళలు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల సమైక్య ఎపిఎం బెజవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహ రహిత భారత దేశాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు, విలేజ్ డ్వాక్రా లీడర్లు, విఒఎలు పాల్గొన్నారు.

ముసునూరు : బాల్య వివాహం చేయటం వల్ల బాల్యంలోనే బాలికలు పలు అనారోగ్య కారణాలకు లోనవుతావురని తహశీల్దార్ దాసరి సుధా, ఎంపిడిఒ జి.రాణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరులో ఎంపిడిఒ కార్యాలయం నుంచి మండపం సెంటర్ వరకు బాల్య వివాహం చేయటం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సూపర్‌డెంట్ కూచిపూడి సాయిరాం, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీ రాజన్, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని తహశీల్దార్ దాసరి సుధ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరులో బేటి బచావో - బేటి పడావో కార్యక్రమం అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణి, పిఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది, ఎంపిడిఒ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహ రహిత దేశంగా భారతదేశం ఏర్పడడానికి ప్రతి పౌరుడు కృషి చేయాలని సిడిపిఒ పి.బ్యూలా తెలిపారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్య వివాహ రహిత భారతదేశం, జిల్లా కార్యక్రమంలో భాగంగా స్థానిక మసీదు సెంటర్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వరలక్ష్మి, ఆర్ఐ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి : ఎంఎల్ఎ

శనివారపుపేట సహకార సంఘం అధ్యక్షుడిగా రంగబాబు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆళ్ల నాని

ప్రభుత్వ ఆశయాలను, లక్ష్యాలను సాధించడంలో సహకార బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తాయని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎంఎల్ఎ ఆళ్ల నాని పేర్కొన్నారు. శనివారపుపేట సహకార సంఘం అధ్యక్షుడిగా కంది రంగబాబు ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు రుణాల మంజూరు, కౌలు రైతులకు, రైతు కూలీలకు విస్తృత ప్రయోజనాలు కల్పించేందుకు సహకార బ్యాంకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, మద్దతు ధర, సబ్సిడీలను విరివిగా మంజూరు చేయాలని తెలిపారు. శనివారపు పేట విశాల పరపతి సంఘం నూరేళ్ల పూర్తయిన సందర్భంగా బ్యాంకు పురోభివృద్ధికి పలువురు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారి విశ్వాసాన్ని చూరగొనాలని ఆకాంక్షించారు. ఇప్పటి వరకూ శనివారం పేట బ్యాంకు ఛైర్మన్‌గా సేవలందించిన పిలారిశెట్టి కృష్ణ కుమార్(బాజీ)ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా ప్రతిపాదిస్తున్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్‌లు ఎన్.సుధీర్ బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, మంచెం మైబాబు, రైతులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ఆరోగ్య సురక్ష లక్ష్యం


టి.నర్సాపురంలోని సురక్షలో వైసిపి అధ్యక్షులు వాసిరెడ్డి



చాట్రాయిలోని సురక్షలో ఎంఎల్ఎ అప్పారావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యమని వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు తెలిపారు. మండలంలోని బంధంచర్ల గ్రామంలో సోమవారం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్యాధికారిణి డాక్టర్ కల్పనా రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డెంగ్యూ, మలేరియా, బిపి, షుగర్ వంటి 9 రకాల రక్త పరీక్షలు నిర్వహించి, 150 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత భారత్ నిర్మాణానికి కృషి చేద్దాం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగాకుమారి, ఎంఇఒ కళ్యాణి, పోలవరం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బోట్ల విశ్వనాథం, సర్పంచి గుండె వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎం.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చాట్రాయి : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి డాక్టర్లను పంపించి, ప్రజల ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకుంటూ, వైద్య, ఆరోగ్య రంగానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని ఎంఎల్ఎ మేక వెంకటప్రతాప్ అప్పారావు తెలిపారు. మండలంలోని నరసింహారావు పాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తుల ఇంటికే మందులు పంపిణీ చేసి సిఎం జగన్ చేస్తున్న కృషి మరువలేనిదని తెలిపారు. అనంతరం హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. చీపురుగూడెం గ్రామంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపిపి లంక నిర్మల, జెడ్‌పిటిసి చెలికాని అనూష, ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని ఎస్ఆర్‌పి అగ్రహారం సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, వైస్ ఎంపిపి కనక దుర్గా రాణి, సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, ఆశా పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జగనన్న సురక్ష కార్యక్రమంలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. సోమవారం మండలంలోని దేవులపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దొరేపల్లి సత్యనారయణ, జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జీ, ఎంపిపి కొదమ జ్యోతి, వైసిపి మండల కన్వీనర్ పార్థసారథి, ఎంపిటిసి ప్రగఢ వెంకట లక్ష్మీ, గోపాల్ కృష్ణ పాల్గొన్నారు.

ముదినేపల్లి : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, కోడూరు, చినపాపలపర్రు గ్రామాల సర్పంచులు మొవ్వ జయలక్ష్మి, ఎ.వెంకట్రావు, నాయకులు తాడంకి రాజేష్, బండి చినబాబు, రావణ్, దివి సతీష్, బేతు రాజా, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ


చింతలపూడిలో కరపత్రాలు పంచుతున్న టిడిపి నేతలు


ముసునూరులో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై వైసిపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని, చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారని, ప్రజలే మద్దతు తెలియజేస్తున్నారని జనసేన మండల అధ్యక్షులు చిదారాల మధుబాబు, టిడిపి, పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం తెలిపారు. టిడిపి ఆధ్వర్యంలో నగర పంచాయతీ మెరకవీధిలో నాయకులు సూరిబాబు చంద్రబాబు నాయుడుకి మద్దతుగా మేము సైతం బాబు కోసం అంటూ ప్రతీ ఇంటింటికీ కర పత్రాలు పంపిణీ చేస్తూ, దుర్గమాత అమ్మ వారికి బాబుతో నేను అనే కరపత్రం ఇచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, భారతి పాల్గొన్నారు.

ముసునూరు : ప్రజల నిరసనలను చూసినా.. ఈ ప్రభుత్వానికి జ్ఞానో దయం కల గడం లేదని నూ జివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరావు తెలిపారు. ముసునూరు మండలం, అక్కిరెడ్డిగుడెం గ్రామంలో 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంచారు. అనంతరం కాగడాలు, కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వేదిక కూల్చివేతతో ప్రారంభమైన విధ్వం సకర పాలన ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రతిపక్ష నాయకుల అరెస్టులకు దారి తీసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు పాల్గొన్నారు.

చింతలపూడి : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మతంగూడెం గ్రామంలో టిడిపి నేతలు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. లింగపాలెం మండల అధ్యక్షులు గరిమళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షులు జాస్తి శ్రీనివాసరావు అధ్యక్షతన ఇంటింటికీ వెళ్లి నారా చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్టుకు నిరసనగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి పిల్లల శ్రీనివాస్ యాదవ్, దశరథ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం

క్రీడా పోటీల్లో సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పోలవరం

ఇంటర్ జిల్లా సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థుల క్రీడా పోటీల్లో పోలవరం సెంట్ ఫ్రాన్సిస్ పాఠశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌గా గెలుపొందడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ టీనా కొరియా కోస్ విజేతలకు షీల్డ్‌లు, ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా టీనా కొరియా కోస్ మాట్లాడుతూ కోకో పోటీల్లో 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో జిల్లాలో దెందులూరు, ఇరుసుమండ, పోలవరం మూడు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని, ఈ పోటీలలో తమ విద్యార్థులు గెలుపొందడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.నాగేశ్వరరావు, రాజు, విజేతలను ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.